దయనీయంగా రెగ్యులేటర్ వంతెన

- పని చేయని షట్టర్లు
- శిథిలావస్థలో ప్రధాన షట్టర్
- ఎమ్మెల్యే పరిశీలించినా ఫలితం శూన్యం


గుడివాడరూరల్: వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు, మురుగు నీరు పోయేందుకు నందివాడ మండలం పోలుకొండలోని చంద్రయ్య డ్రెయిన్‌పై నిర్మించిన రెగ్యులేటర్ వంతెన పరిస్థితి దయనీయంగా మారింది. రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారి, షట్టర్లు తుప్పు పట్టి పని చేయడం లేదు. మరమ్మతులకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాదైనా నిధులు మంజూరు చేస్తుందని ఆశించినా పరిసర ప్రాంత రైతులకు నిరాశే ఎదురైంది. నందివాడ, గుడివాడరూరల్, మండవల్లి మండలాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలకు చంద్రయ్య డ్రెయిన్ సాగునీరు అందించడంతో పాటు మురుగు నీరు కొల్లేరులోకి పోయేందుకు ఉపయోగపడుతుంది.


శిథిలావస్థలో పోలుకొండ రెగ్యులేటర్ వంతెన


నిరుపయోగంగా మారిన ప్రధాన షట్టర్

ఏడు దశాబ్దాల క్రితం నిర్మాణం

ఏడు దశాబ్దాల క్రితం రెగ్యులేటర్ సౌకర్యం లేకపోవడంతో నీరు వృథాగా కొల్లేరులోకి పోయేది. దీనివలన మూడు మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందక పంటలు పండించలేని పరిస్థితి ఉండేది. సమస్యను గ్రహించిన పోలుకొండ మాజీ సర్పంచ్ పర్వతనేని బసవ శంకరరావు చంద్రయ్య డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మాణం చేస్తే నీటిని నిల్వ చేయడమే కాకుండా వరదలు వచ్చిన సమయంలో పంట పొలాలు ముంపునకు గురి కాకుండా దిగువకు పంపేందుకు రెగ్యులేటర్ నిర్మిస్తే అందరికీ ఉపయోగపడుతుందని గ్రహించారు. అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెగ్యులేటర్ వంతెన నిర్మాణానికి కృషి చేశారు. కొంతకాలంగా రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరింది. రెగ్యులేటర్ ప్రధాన షెట్టర్ ధ్వంసమై పని చేయకపోవడంతో డ్రెయిన్‌కు వస్తున్న నీరు వృథాగా దిగువకు పోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రముఖ ఆక్వా రైతు ముదునూరు లింగరాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతులు షట్టర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరు వెళ్లకుండా నిలుపుదల చేశారు.


దెబ్బతిన్న రెగ్యులేటర్ గోడలు

షట్టర్ల పర్యవేక్షణ గాలికి

అధికారులు మాత్రం షట్టర్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. కొన్ని సంవత్సరాలుగా రెగ్యులేటర్ మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. రెగ్యులేటర్ గోడలు బీటలు వాలి రోడ్డు శిథిలమై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెగ్యులేటర్ సమీపంలోనే మరో వంతెన నిర్మించినా వంతెన ఇప్పటికే శిథిలం కావడంతో పాత రెగ్యులేటర్ వంతెనే గ్రామాల ప్రజలకు దిక్కుగా మారింది.

రైతులకు నిరాశే

ఏడాది క్రితం ఎన్నికల సమయంలో రెగ్యులేటర్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి షట్టర్లను నిర్మిస్తామని కూటమి నేతలు చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయి. వేసవి సమయంలో షట్టర్లకు మరమ్మతులు చేయిస్తారని ఆశించినా అటువైపుగా ఎవరూ చూసిన పాపానపోలేదు. ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రెగ్యులేటర్‌ను పరిశీలించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తామని ఇచ్చిన మాట నెరవేరలేదు. కాల్వలకు నీరు వచ్చే సమయం వచ్చినా నేటికి మరమ్మతుల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉండటంతో అటు రైతన్నలు, ప్రజలు నిరాశ నిస్పృహలు వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

మూడు మండలాల్లోని పంట భూములు, చేపల చెరువులతో పాటు రవాణా సౌకర్యం కలిగి ఉన్న రెగ్యులేటర్ శిథిలమవుతున్నా సంబంధిత ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. షట్టర్ల నిర్వహణకు ఏర్పాటు చేసిన లస్కర్ గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవు. లస్కర్ ప్రైవేట్ వ్యక్తులతో రెగ్యులేటర్ షట్టర్ల నిర్వహణ నిర్వహిస్తున్నారు. పాలకులు, అధికారులు సైతం రెగ్యులేటర్ నిర్వహణను గాలికి వదిలేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రెగ్యులేటర్‌కు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



రెగ్యులేటర్ షట్టర్లు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. షట్టర్ల మరమ్మతులను ఎప్పటికప్పుడు నిర్వహించాలి. నీటి ప్రవాహం అధికంగా వచ్చినప్పుడు పర్యవేక్షణ జాగ్రత్తగా చేయాలి. అధికారులు మాత్రం రెగ్యులేటర్‌ను గాలికి వదిలేశారు. ప్రైవేట్ వ్యక్తులతో రెగ్యులేటర్ నిర్వహిస్తున్నారు. రెగ్యులేటర్ శిథిలావస్థకు అధికారుల నిర్లక్ష్యమే కారణం.

– జోసఫ్, పోలుకొండ గ్రామస్తుడు

సాగునీరు ప్రశ్నార్థకం



ఏడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ శిథిలమైతే వేలాది ఎకరాలకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారుతుంది. మురుగునీరు వెళ్లే అవకాశం లేక గ్రామాలు ముంపుబారిన పడతాయి. పదుల సంఖ్యలో గ్రామాలకు రోడ్డుమార్గం లేకుండా పోతుంది. అధికారులు వెంటనే స్పందించి షట్టర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

– ఎ.రవికిరణ్, లింగవరం గ్రామస్తుడు

క్లుప్తంగా

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

బందరు కాలువలో నాచు తొలగింపు



తోట్లవల్లూరు: బందరు కాలువలో నాచు తొలగింపు పనులకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలోని వల్లూరుపాలెం నుంచి పమిడిముక్కల మండలం ఫత్తేలంక వరకు బందరుకాలువ అడుగు భాగాన పేరుకుపోయిన కర్రనాచును పంటు ద్వారా తొలగిస్తున్నారు. పంటుపై ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి నీటి అడుగు భాగాన ఉన్న నాచును, గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టారు. పనులను కంకిపాడు ఇరిగేషన్ ఏఈఈ నాగబాబు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గుడివాడ టౌన్ : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ–కనకమహాలక్ష్మి వితరణతో ఈ పుస్తకాలు పంపిణీ జరిగినట్లు సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ వి. భాగ్యవతి, జి. నాగేశ్వరరావు, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ కె. ఆజయ్‌కుమార్, జె. మునీంద్ర, జె తాతారావు, నాగమణి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మొవ్వ: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి పేర్కొన్నారు. మొవ్వ గ్రామంలో వేమూరి సుందరరామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించి ప్రధాన కూడలిలో మానవ హారాన్ని ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల, డాక్టర్ టి శ్రీకాంత్ , ఆర్ వెంకయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు జి. మురళీకృష్ణను కళాశాల కరస్పాండెంట్ వి. కోదండరామయ్య, డైరక్టర్ బి. కల్యాణ్‌కుమార్ అభినందించారు. పుదుచ్చేరి టెక్నికల్ యూనివర్సిటీ నుంచి ఈ డాక్టరేట్ పొందినట్లు పేర్కొన్నారు

5న జాతీయ లోక్ అదాలత్

కైకలూరు: జాతీయ లోక్ అదాలత్ జూలై 5న నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ వీవీఎస్‌వీ లక్ష్మి మంగళవారం తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, న్యాయవాదులు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల ధర్నా

గుడివాడ టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టత లేదని హేతుబద్ధీకరణ ద్వారా మిగులు ఉద్యోగుల విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇప్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రమోషనల్ చానల్ కల్పించాలి, సీనియారిటీ లిస్ట్ తయారు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలంటూ రోడ్లపై తిప్పుతూ రాత్రి, పగలు తేడాలేకుండా పనిచేయిస్తున్నారన్నారు. ప్రమోషన్, పే స్కేల్ ఇచ్చిన అనంతరం బదిలీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విలేజ్ అండ్ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శంకరరావు, సభ్యులు సునీత, గణేష్, మనోజ్, రాజేష్, భాషాపృథ్వి, రవికిరణ్ పాల్గొన్నారు.


గుడివాడలో ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పామర్రు: సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగువిధమైన పరిష్కారం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతో కాలంగా విధులు నిర్వహిస్తున్నా తమకు సరైన గుర్తింపు లేదన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చూస్తామన్నారు.


ఎమ్మెల్యే కుమార్‌రాజాకు వినతిపత్రం ఇస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయండి

కైకలూరు: గ్రామీణ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ప్రతి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో మండవల్లి మండలం నుచ్చిమిల్లి పార్టీ గ్రామ కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సైదు చంద్రయ్య పేరును ఖరారు చేస్తూ మండల పార్టీ అధ్యక్షుడు బేతపూడి ఏసోబురాజు పత్రాలను డీఎన్నార్‌కు అందించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ఏడాది కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ప్రజా సమస్యలపై గ్రామ స్థాయిలో నాయకులు పోరాడాలన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు పాల్గొన్నారు.


నుచ్చిమిల్లి గ్రామ కమిటీ లేఖలను అందుకుంటున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

పెనమలూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. పెనమలూరులో మెరుగు విజయ్‌కుమార్ ప్రాంగణంలో మంగళవారం సీపీఐ పెనమలూరు నియోజకవర్గ సమితి 25వ మహాసభలు జరిగాయి. సీనియర్ నాయకుడు గాలంకి వసంతరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకుంటే ఇప్పటి వరకు నిందితులను పట్టుకోవటంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఘటనను మరుగున పడేయటానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అమెరికాకు దాసోహమైందన్నారు. అమెరికా స్వార్థం కారణంగానే నేడు యుద్ధం జరుగుతుందని తెలిపారు. ఈ యుద్ధం వలన క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

8, 9 తేదీల్లో జిల్లా మహాసభలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. యోగాంధ్ర పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ప్రజా ధనాన్ని వృథా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా నేడు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ గత వందేళ్లలో అనేక త్యాగాలు చేసిందన్నారు. జూలై 8, 9 తేదీల్లో జిల్లా మహాసభలో గన్నవరంలో, రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, నాయకులు వి.బాలస్వామి, మోతుకూరి అరుణ్‌కుమార్, బండి ప్రేమ్‌కుమార్, ముత్యాల పోతురాజు, నాగేశ్వరరావు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు. మానికొండ రహదారి పై వంతెన నిర్మించాలని, బుడమేరు ముంపు నుంచి రక్షణ కల్పించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని తీర్మానాలు చేశారు.


పెనమలూరులో మాట్లాడుతున్న నార్ల వెంకటేశ్వరరావు

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

బల్లిపర్రు(పామర్రు): వరి సాగులో విత్తన శుద్ధి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని బల్లిపర్రు, పెదమద్దాలి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీ విత్తనాలకు రెండు కేజీల కార్బండిజిమ్ కలిపి 24 గంటలు తరువాత నారుమడుల్లో చల్లుకోవాలని తెలిపారు. దీని వలన నారుమడిలో పురుగులు, తెగుళ్లు ఆశించబోవన్నారు. నారుమడి యాజమాన్య పద్ధతులను వివరించారు. నారు తీయటానికి ఏడు రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో కలిపి వేయాలన్నారు. జింక్ లోపం ఉంటే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. 5 సెంట్ల నారుమడికి రెండు కేజీల నత్రజని (1కేజీ విత్తే ముందు, 1కేజీ విత్తిన 12–14 రోజులకు) చల్లాలన్నారు. 1కేజీ భాస్వరం, ఒక కేజీ పొటాష్ విచ్చే ఎరువులను దుక్కిలో వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఏఓ శివ నాగరాణి, వీఏఏలు పాల్గొన్నారు.


బల్లిపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

చట్టాలపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వీటిపై అవగాహన పెంచుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు పంపిన ఏపీకే యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని, వీటి ద్వారా ఫోన్లు హ్యాకింగ్‌కు గురవుతున్నాయని చెప్పారు. ఓటీపీలు, ఏటీఎం కార్డు పిన్, బ్యాంకు ఖాతా వివరాలను గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద కాలంలో పోలీసులకు సమాచారం అందించటంద్వారా రక్షణ పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, గుట్కా వంటి నిషేధిత మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సత్యనారాయణ సూచించారు. బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల నియంత్రణకు అమలు చేస్తున్న పోక్సో చట్టం గూర్చి వివరించారు. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్, ఆంగ్ల ఉపాధ్యాయుడు రమణగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

కలిదిండి(కైకలూరు): కిడ్నీ బాధితుడికి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం రూ.1.35 లక్షల సాయాన్ని కలిదిండిలో మంగళవారం అందించారు. కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారానికి చెందిన గూడవల్లి శ్రీనివాసరావు కుమారుడు నితిన్‌కుమార్‌కు జన్యుపరమైన ఇబ్బంది వలన లివర్, కిడ్నీల సమస్య వచ్చింది. ఇతడికి బాల్యం నుంచి ఈ సమస్య ఉండగా రెండేళ్ల క్రితం వివాహం అయింది. వైద్యులు రూ.70 లక్షలు వైద్యానికి ఖర్చు అవుతోందని తేల్చారు. తండ్రి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్. ఇప్పటి వరకు వైద్యం నిమిత్తం రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఆర్థిక సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. దీంతో రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు, బొర్రా చలమయ్య బాధితుడిని పరామర్శి సేకరించిన నగదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పరసా ఏడుకొండలు, కైకలూరు నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు, కలిదిండి మండల అధ్యక్షుడు కట్టా పాండురంగరావు, బొర్రా సత్యనారాయణ, మారగాని గణపతి, సత్యనారాయణ, వెంకట్, నాగబాబు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న గౌడ సంఘ నాయకులు

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పాల పొంగళ్లను వండి స్వామికి నివేదనలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పూజలను ఆలయ అర్చకులు అగ్రిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సందేష్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు


సందేష్

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరు శివారు ఉప్పరగూడేనికి చెందిన ఆర్.సందేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. సందేష్ పెదగొన్నూరు హైస్కూల్లో పదో తరగతి చదివి పబ్లిక్ పరీక్షల్లో 573 మార్కులు సాధించాడు. సందేష్‌కు సీటు రావడంపై హైస్కూల్ హెచ్ఎం ఉదయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మొవ్వలో..


జ్ఞానశ్రీవల్లి

మొవ్వ: మొవ్వ మండలం నిడుమోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తోట జ్ఞానశ్రీవల్లి ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం అరుణ తెలిపారు. ఈ విద్యార్థినిని పాఠశాల విద్యా కుటుంబ సభ్యులు అభినందించారు

ఎమ్మార్పీకే ఎరువులు అందజేస్తాం



మొవ్వ: గతంలో మార్క్ ఫెడ్ ద్వారా ఎరువులు సరఫరా చేసేవారని ఆ విధంగా ఈ ఏడాది కూడా సరఫరా చేసినట్లయితే రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు అందజేస్తామని మొవ్వ మండల ఫెర్టిలైజర్స్, పెస్టిసైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మండలంలోని డీలర్స్ యూనియన్ అధ్యక్షుడు దండమూడి వంశీకృష్ణ నాయకత్వంలో ఏడీఏ ఎస్.శ్యామలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పామర్రు: స్థానిక రామాలయం వద్ద మంగళవారం మహా భారత ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనంలో పాల్గొన్న భక్తులకు ఉయ్యూరు నగర పంచాయతీ కమీషనర్ పీ వెంకటేశ్వరరావు భగవత్ గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి స్థాపనకు భగవద్గీత ఎంతో ప్రామాణికమైనదన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు భగవద్గీత ప్రామాణికంగా తీసుకుని ఉన్నతులుగా మారుతున్నారన్నారు. గీతా పారాయణ వలన మనస్సుకు శాంతి చేకూరుతుందన్నారు.

రెండో రోజు కొనసాగిన దీక్షలు



మండవల్లి: తమ ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించొద్దని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ కాలనీ ఇళ్ల లబ్ధిదారులు మంగళవారం రెండో రోజు రిలే దీక్షలు చేశారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజాల పద్మ, చిగురుపాటి చింతామణి, ప్రసన్న, చిన్ని కొల్లయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వృద్ధులకు ఇంటింటికీ రేషన్

కైకలూరు: దివ్యాంగులు, 65 సంవత్సరాల వృద్ధులకు ఈ నెల 26 నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం మంగళవారం తెలిపారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగానే రేషన్ పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, సర్వేయర్ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.